దాసరి
# ఉదయం
https://epaper.udayamdaily.com
తెలుగు దినపత్రిక

సంపుటి : 13 సంచిక : 97 | జగిత్యాల | ఎడిటర్ - మొహమ్మద్ ఇమ్రాన్ | బుధవారం 25, డిసెంబర్ 2024 | పేజీలు : 04 | వెల : 1.00/-

## భారీగా కురిసిన మంచు...

### చిక్కుకున్న వెయ్యి వాహనాలు, పర్యాటకులు

హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా కురుస్తున్న తెల్లటి మంచు దుప్పటితో కష్టాలు పెరుగుతున్నాయి. విపరీతంగా కురుస్తున్న మంచు కార ణంగా మనాలి, సోలాంగ్ నాలా, అటల్ టన్నెల్ మధ్య సుమారు 1000 వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అటల్ టన్నెల్ నుంచి మనాలిలోని సోలాంగ్ నాలా వరకు లేహ్ మనాలి జాతీయ రహదారిపై మంచు భారీగా కురిసింది. దీంతో వాహనాలు జారిపోయి సొరంగం దగ్గర అనేక వాహనాలను ఆపవలసి వచ్చింది. ఇదే సమయంలో మంచు దృష్యాలను చూసేందుకు అక్కడికి చేరుకున్న పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. మరికొంత మంది అటల్ టన్నెల్ సమీపంలోని లాహౌల్ స్పితి సందర్శనకు వెళ్లాలని చూసిన పర్యాటకులను పోలీసులు నిలిపివేశారు. ఆ తర్వాత హిమపాతంలో చిక్కుకున్న పర్యాటకులను పోలీసులు రక్షించారు.




హైదరాబాద్ : ఈ నెల 30న రాష్ట్ర కేబినెట్ సమావేశం కానుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆరో ఫ్లోర్?లో ఈ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రైతుభరోసా విధి విధానాలు, కొత్త రేషన్ కార్డుల జారీపై చర్చించే అవకాశం ఉంది. అలాగే, భూమిలేని నిరు పేద కూలీలకు రెండు విడతల్లో రూ.6 వేల చొప్పున నగదు బదిలీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు అంశాలు కూడా చర్చకు వచ్చే చాన్స్ ఉంది. ఒక్క ఎకరా కూడా వ్యవసాయ భూమిలేని, కూలి పనులు చేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ఆర్థిక సాయం చేసే పథకం గురించి మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు.

వచ్చే నెల సంక్రాంతి తరువాత రైతుభరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు. దీనిపై కూడా చర్చించే అవకాశం ఉంది.




హైదరాబాద్: సంధ్య థియేటర్ కేసులో సినీనటుడు అల్లు అర్జున్ విచారణ ముగిసింది. తన తండ్రి, నిర్మాత అల్లు అరవింద్‌తో కలిసి మంగళవారం ఉదయం 11 గంటలకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

వారితో పాటు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, బన్నీ వాసు ఉన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన.. తదనంతర పరిణామాలపై పోలీసులు అల్లు అర్జున్‌ను దాదాపు మూడున్నర గంటలకు పైగా ప్రశ్నించారు. ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సమక్షంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ ఆయన్ను ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనపై పోలీసులు ఇటీవల 10 నిమిషాల వీడియోను విడుదల చేశారు. దాని ఆధారంగా ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నెల 4న రాత్రి సంధ్య థియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్ షో చూసేందుకు అల్లు అర్జున్ వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు అనుమతి నిరాకరించినా ర్యాలీ నిర్వహించి ఒకరి మృతికి కారణమయ్యాడనే అభియోగంతో చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

ఆయనకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయటంతో చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు.




రెజిమెంటల్ బజార్: సంధ్య థియేటర్ తొక్కిసలాట దుర్ఘటన అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో సినీ పరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని భాజపా ఎంపీ డీకే అరుణ అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభిమానులుగా వెళ్లిన కుటుంబంలో తల్లి రేవతి చనిపోవడం, కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం బాధాకరమన్నారు. సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉండాలన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో ఆలోచించకుండా ముగింపు పలకాలని కోరారు.

## యేసు ప్రభువు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

హైదరాబాద్ : మెన్నోనైట్ బ్రదర్న్ క్రైస్తవ సంఘం ప్రతినిధులు క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. దయ, సేవాగుణం, క్షమాగుణం కలిగిన యేసు ప్రభువు జీవితం అందరికీ స్ఫూర్తి దాయకం అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్టమస్ పండుగను అధికారికంగా నిర్వహిస్తున్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ అని, ముఖ్యమంత్రిగా గత ప్రభుత్వంలో ఆ నిర్ణయం తీసుకున్న కేసీఆర్‌కే ఆ ఘనత దక్కుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.





## అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ర్యాలీ

హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముఖ్యనేతలు కొప్పుల రాజు, అనిల్‌కుమార్, వీహెచ్, రోహిన్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున కార్యక్రతలు పాల్గొన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నేడు కాంగ్రెస్ నేతలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌లో రాష్ట్ర నేతలు నిరసన చేపట్టారు.




## ఏపీకి కొత్త సీఎస్ ఎవరు?.. అధికార వర్గాల్లో జోరుగా చర్చ

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎవరనే చర్చ జోరందుకుంది. ప్రస్తుత సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో.. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎవరనేది ఆసక్తిగా మారింది. సీనియారిటీ ప్రకారం 8 మంది పేర్లు జాబితాలో ఉన్నప్పటికీ.. సీఎం మదిలో ఎవరున్నారన్నది త్వరలోనే తేలనుంది.**


## ఢిల్లీకి సీఎం చంద్రబాబు నాయుడు..

### నేడు వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమంలో హాజరు కానున్న చంద్రబాబు

అమరావతి : తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలోని కీలక కార్యక్రమాలకు హాజరవడానికి వెళ్లనున్నారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు రేపు ఢిల్లీలో జరిగే మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

ఈ కార్యక్రమం జాతీయ స్థాయిలో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. వాజ్‌పేయ్ రాజకీయ మార్గదర్శకత్వం, దేశభక్తి, వంటి అనేక సేవలను గుర్తు చేసుకునేందుకు ఈ వేడుక నిర్వహిస్తున్నారు.

**ఈ అంశాలపై చర్చ..** వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా ఆయనకు చంద్రబాబు నివాళులర్పించనున్నారు. ఆయన రాజకీయ ఆశయాలను కొనసాగించే క్రమంలో భారతదేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలను ఎలా పటిష్టం చేయాలనే అంశంపై చర్చలు జరగనున్నాయి. అయితే 1980 నుంచి 2004 వరకు భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వాజ్‌పేయ్, ఆ సమయంలో బీజేపీని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టారని చెప్పవచ్చు. ఆయన నాయకత్వంలో దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.



ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిలో భాగమైన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు, బీజేపీ నేతలు పాల్గొని, దేశ రాజకీయాలపై సమీక్ష, చర్చలు జరిపే అవకాశం ఉంది. తెలుగు దేశం పార్టీ జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయడానికి పలు అంశాలను ప్రస్తావించవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సంబంధాల పరంగా కూడా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని చెప్పవచ్చు.

## అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్సే: పురందేశ్వరి

రాజమహేంద్రవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను తీవ్రంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్సేనని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి విమర్శించారు.

రెండు సార్లు ఎన్నికల్లో ఓడించి పార్లమెంట్‌లో అడుగు పెట్టకుండా ఆయన్ను మానసిక క్షోభకు గురిచేశారన్నారు. రాజమహేంద్రవరంలో మీడియాతో పురందేశ్వరి మాట్లాడారు. వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్న సమయంలో అంబేడ్కర్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించామని గుర్తుచేశారు. అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించింది భాజపా అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా భాజపా సభ్యత్వాలు నమోదవుతున్నాయని చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో పూర్తి



విచారణ జరగాల్సి ఉందని.. అక్కడ మరింత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని పురందేశ్వరి అభిప్రాయపడ్డారు.

## వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి



విజయవాడ: వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. వినియోగదారుల హక్కులు, సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడ్డామని.. ఇక్కడ మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. వినియోగదారుల హక్కులు మర్చిపోయేలా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. టీ పౌడర్ నుంచి కందిపప్పు వరకు కల్తీ జరుగుతుందని తెలిపారు. పిల్లలు తినే చాక్లెట్లలోనూ కల్తీ జరుగుతుందని చెప్పారు. వీటిని నివారించేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధాన్యం సేకరణ తర్వాత 24 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో జవాబుదారీతనం ఉండాలని అన్నారు.

దీపం -2 పథకం ద్వారా 75 లక్షల గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం మాదిరిగానే ప్రతి ప్రైవేట్ సంస్థ జవాబుదారీతనంతో ఉండాలని అన్నారు. చట్టాలు తీసుకువస్తే సరిపోదు, అవి యాక్టివ్‌గా ఉండాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆహార కల్తీ నివారణకు జిల్లాకో ల్యాబ్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నామన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చట్టంలోని హక్కులను పౌరులు ఉపయోగించుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

## ఏపీ ఫైబర్‌నెట్‌లో గత ప్రభుత్వం నియమించిన 410 మందిని తొలగిస్తాం: జీవీ రెడ్డి

విజయవాడ: ఏపీ ఫైబర్‌నెట్‌ను ప్రక్షాళన చేస్తున్నామని ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. "ఫైబర్ నెట్ నుంచి ఆర్జీవీకి అక్రమంగా డబ్బు చెల్లించారు. డబ్బు తిరిగి చెల్లించేందుకు ఆయనకు 15 రోజుల సమయం ఇచ్చాం. గడువులోగా డబ్బు చెల్లించకుంటే ఆర్జీవీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. గత ప్రభుత్వం అర్హతలేని వారిని ఫైబర్‌నెట్‌లో నియమించింది. గత ప్రభుత్వం నియమించిన 410 మందిని తొలగిస్తాం. వైకాపా నేతల ఆదేశాలతో అర్హత లేని వారిని నియమించారు. కొందరు సిబ్బంది వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఇళ్లలో పనిచేశారు. వేతనాల పేరుతో ఫైబర్‌నెట్ నుంచి రూ. కోట్లు దుర్వినియోగం జరిగింది. వైకాపా ప్రభుత్వం వైఖరితో ఫైబర్‌నెట్ దివాలా అంచుకు చేరింది. మేం కక్షతో, దురుద్దేశంతో ఉద్యోగులను తొలగించడం లేదు. ఉద్యోగులకు లీగల్ నోటీసులు ఇచ్చి వివరణ కోరతాం. ఫైబర్ నెట్‌లో అవసరాల మేరకు ఉద్యోగులను తీసుకుంటాం" అని జీవీ రెడ్డి తెలిపారు.

## చురుగ్గా వారధి నిర్మాణం

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీరనున్నాయి. ఖానాపూర్ మండలం రాజూరా నుంచి పెంబికి వెళ్లేందుకు ఖానాపూర్–సత్తనపల్లి–మందపల్లి మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఖానాపూర్ మండలం రాజూరా నుంచి పెంబి మండలం మందపల్లి మధ్య దూరం రెండు కిలోమీటర్లే. మధ్యలో పల్కేరు వాగు ఉండటంతో వర్షాకాలం వాగు పొంగితే ఈ రెండు గ్రామాల మధ్య రహదారి సౌకర్యం లేకపోవడంతో పెంబికి వెళ్లే వారు ఖానాపూర్ మీదుగా 47 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఈ రెండు గ్రామాల మధ్య పల్కేరు వాగుపై రెండుచోట్ల వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో రాజూరా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు పెంబి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**రూ.18 కోట్లతో పనులు ప్రారంభం**



పల్కేరు వాగు వంతెన ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో రూ.18 కోట్లతో వారధి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రాజూరా తండా నుంచి వంతెన వరకు విశాలంగా మొరం రోడ్డును సిద్ధం చేశారు. అవతలివైపు మందపల్లి వరకు మొరం దారి పనులు పూర్తయ్యాయి. చందునాయక్తండా మధ్యలో 8 పిల్లర్లతో ఓ వంతెన నిర్మాణం చేపడుతుండగా, మందపల్లి వైపు మరో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మందపల్లి నుంచి చందునాయక్ తండా వరకు అయిదున్నర మీటర్ల వెడల్పుతో 5.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పెంబి నుంచి నేరుగా నిర్మల్కు బస్సులు

వాగుపై వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంపై పెంబి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెంబి వాసులు జిల్లా కేంద్రం నిర్మల్కు వెళ్లాలంటే (22 కి.మీ.) ఖానాపూర్ లేదా తర్లపాడు మీదుగా వచ్చి నిర్మల్కు (35 కి.మీ). వెళుతున్నారు. ఈ లెక్కన నిర్మల్కు 57 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. వంతెనల పనులు పూర్తయిన పక్షంలో పెంబి–మందపల్లి–రాజూరా–సింగాపూర్–దిమ్మదుర్తి మీదుగా నేరుగా నిర్మల్కు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. పెంబి నుంచి వయా రాజూరా మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపే అవకాశం ఉండటంతో రాజూరా, బావాపూర్–ఆర్, తండాల ప్రజలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు ఈ ప్రాంతం రవాణా, వ్యాపారపరంగా వృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి.

## అర కి.మీ.. అష్టకష్టాలు

జైపూర్ : జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులోని ఈదులవాగు మీద నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి బిల్లులు రాకపోవడంతో 'ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి' అన్న చందంగా పనులు సాగుతున్నాయి. అయితే వంతెన పనులు పూర్తయ్యాయి. కానీ అర కిలోమీటరు మేర తారు రహదారి నిర్మించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే 12 గ్రామాల ప్రజలు నిత్యం దుమ్ములోనే ప్రయాణించాల్సి వస్తోంది. ప్రసుత్తం ఉన్న కంకర రహదారిపై ప్రయాణానికి అష్టకష్టాలు పడుతున్నారు.

**రూ.3 కోట్లతో పనులు**

జైపూర్–పెగడపల్లి గ్రామాల మధ్యలో ఈదులపల్లి వాగు ఉంటుంది. ఏటా వానాకాలంలో ఎగువన కురిసిన వర్షాలతో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. సమీపంలో ఉన్న టేకుమట్ల వాగు ఉప్పొంగడంతో ఈ రెండు వాగుల మధ్యలో ఉన్న సుమారు 12 గ్రామాల ప్రజలతో పాటు ఎస్టీపీపీలో విధులు నిర్వర్తించే కార్మికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతుంటారు. గతేడాది మార్చి 15న అప్పటి మంత్రి హరీష్రావు వంతెనను అనుసంధానిస్తూ బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్ల నిధులతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవలే వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ బిల్లులు రాకపోవడంతో రహదారి పనులు ముందుకు సాగడం లేదు. అర



కిలోమీటరు మేర కంకర తేలి ఉన్న రహదారిపై ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. గుంతలు పడి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మార్గంలో ముందు భారీ వాహనాలు వెళ్తే వెనుక వచ్చే చోదకుల కళ్లలో దుమ్ము పడుతోంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే భయ పడుతున్నారు.

**ప్రమాదాల బారిన పడుతున్నారు**

వంతెనకు సంబంధించిన బీటి రహదారి నిర్మాణం జరగకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న కంకర రోడ్డుపై నీటిని చల్లకపోవడంతో దుమ్ము లేచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ మార్గం ద్వారానే ఎస్టీపీపీలో పనిచేసే చాలా ఒప్పంద కార్మికులు ప్రయాణం చేస్తుంటారు. గతంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దుస్స భాస్కర్, పెగడపల్లి

**త్వరగా పూర్తి చేయిస్తాం**

గుత్తేదారుకు నిర్మాణానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో రోడ్డు నిర్మాణం జరగడం లేదు. గుత్తేదారుతో మాట్లాడి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. భరత్, ఏఈ ఆర్అండ్బీ

## రాజాజీ సేవలు...భారతీయ సమాజానికి ప్రేరణలు - డిసెంబర్ 25...రాజాజీ వర్ధంతి



సి. రాజగోపాలచారి, అందరికీ రాజాజీగా ప్రసిద్ధుడు, భారతదేశ చరిత్రలో ఒక అపురూపమైన వ్యక్తి. స్వతంత్ర భారతదేశ తొలి భారతీయ గవర్నర్ జనరల్గా, తమిళనాడు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా మరియు సాహితీవేత్తగా తన అసమాన సేవలతో దేశ ప్రజల మనసులో స్థానం సంపాదించారు.

**ప్రారంభ జీవితం...** రాజాజీ 1878 డిసెంబర్ 10న తమిళనాడులోని తొరపల్లి గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన తెలివితేటలతో ప్రతిభావంతుడిగా పేరు గడించారు. న్యాయ విద్యలో పట్టభద్రుడైన రాజాజీ, తన న్యాయవాద వృత్తిలో మంచి గుర్తింపు పొందారు. అయితే దేశసేవ కోసమే తన వ్యక్తిగత లక్ష్యాలను త్యజించి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు.

**స్వాతంత్ర్యోద్యమంలో పాత్ర...** రాజాజీ భారత స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీతో కలిసి కీలక పాత్ర పోషించారు. గాంధీజీ సిద్ధాంతాలకు రాజాజీ ఒక శ్రద్ధావంతమైన అనుచరుడిగా నిలిచారు.

**సత్యాగ్రహంలో భాగస్వామ్యం:** 1930లో సాల్ట్ సత్యాగ్రహంలో పాలుపంచుకొని అహింస సిద్ధాంతాలను అనుసరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక సార్లు జైలుకు వెళ్లినా, రాజాజీ తన లక్ష్యంపై పట్టుదలతో నిలిచారు.

బ్రిటిష్ పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా సేవలందించారు.

**స్వతంత్ర భారతదేశంలో రాజాజీ...** భారత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, రాజాజీ అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. 1948లో ఆయన స్వతంత్ర భారతదేశ తొలి భారతీయ గవర్నర్ జనరల్గా నియమితులయ్యారు.

ఆయన పాలనలో దేశ పరిపాలన మరింత క్రమబద్ధమైనదిగా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాలంలో సాగునీరు, విద్య, ఆరోగ్యం రంగాలలో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించారు.

**రాజకీయ విశేషాలు...** రాజాజీ మితవాదం మరియు న్యాయవాదంపై తన గట్టి విశ్వాసంతో ప్రసిద్ధి పొందారు. ఆయన సామ్యవాదం మరియు కమ్యూనిజాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1959లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి విడిపోయి స్వతంత్ర పార్టీని స్థాపించారు. స్వేచ్ఛా ఆర్థిక విధానాలను ప్రోత్సహించి, రైతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన కార్యక్రమాలు చేపట్టారు.

**సాహిత్యం రచనలు...** రాజాజీ ఒక ప్రతిభావంతమైన రచయిత, అనువాదకుడు. భగవద్గీత, రామాయణం, మహాభారతం వంటి శ్రేష్ఠ గ్రంథాలను సరళమైన భాషలో అనువదించి సాధారణ ప్రజలకీ అందించారు. తమిళ సాహిత్యానికి ఆయన చేసిన సేవలు విశేషంగా ఉన్నాయి. ఆయన రాసిన వ్యాసాలు, రచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి.

**సామాజిక సేవ...** రాజాజీ సామాజిక సమానత్వం కోసం విశేష కృషి చేశారు. దళితుల అభ్యున్నతి: దళితుల కోసం అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టి, వారి స్థితిని మెరుగు పరిచారు. అనేక విద్యా సంస్థలను స్థాపించి, విద్యా రంగ అభివృద్ధికి పునాదులు వేశారు.

**పురస్కారాలు గౌరవాలు...**రాజాజీ భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న (1954) అందుకున్నారు. ఆయన నిస్వార్థ సేవ, సాంస్కృతిక విరుద్ధాలు, రాజకీయ దూరదర్శిత్వం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి.

**వారసత్వం...**రాజాజీ 1972 డిసెంబర్ 25న మరణించారు. ఆయన చేసిన సేవలు, రచనలు భారతీయ సమాజానికి శాశ్వత ప్రేరణగా నిలిచాయి. భారతీయ రాజకీయాల్లో నైతిక విలువల పునాదిని ప్రతిష్ఠించిన మహనీయుల్లో రాజాజీ ఒకరు. రాజాజీ భారతదేశ చరిత్రలో ఒక గౌరవనీయ వ్యక్తి. ఆయన రాజకీయ విజ్ఞానం, సాహిత్య కృషి, సామాజిక సేవలు దేశ ప్రజలకు ఆదర్శప్రాయంగా మారాయి. ఆయన జీవితం, సిద్ధాంతాలు ప్రతి భారతీయుడి గుండె లోతుల్లో స్ఫూర్తి నింపేలా ఉన్నాయి. తన ధర్మం, త్యాగం, దేశ సేవతో రాజాజీ చరిత్ర పుటల్లో ఒక చిరస్మరణీయ మహనీయుడిగా నిలిచిపోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు మాలవ్య - డిసెంబర్ 25... భారతరత్న మదన మోహన మాలవ్య జయంతి




భారతదేశ వాసులచే %–%మహాత్ముని'గా గౌరవించ బడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే %–%మహామాన%–% బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861–1946) భారతీయ విద్యావేత్త, రాజకీయవేత్త. భారతీయ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సమరయోధుడు. ఆయన "పండిట్ మదన్ మోహన్ మాలవీయ" గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌవరింప బడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు. 1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థకమైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించేవాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలంపేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రులైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్గా పనిచేశాడు. అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు. 1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడుతున్న ఆంగ్ల పత్రిక లీడర్పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్ కు చైర్మన్ గా ఉన్నాడు. ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగ పడ్డాయి. 1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించినప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్లో అఖిలభారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యంలోకి తీసుకొచ్చింది మాలవ్యనే. మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909 %ు% 1913,1919,1932) పని చేశాడు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచిపెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922 లో చౌరీ చౌరా దాడుల ఘటనలో మరణశిక్ష పడిన 225 మంది స్వాతంత్ర్య సమరయోధులు, సాధారణ ప్రజానీకం తరపున వాదించి వారిలో 153 మందికి ఆ శిక్ష పడకుండా కాపాడ గలిగాడు. గంగా నది పరిరక్షణ కోసం 'గంగా మహాసభ' పేరుతో ఉద్యమాన్ని కూడా లేవదీశాడు మాలవ్య. భారతీయ స్కౌట్స్ మరియు గైడ్సు వ్యవస్థాపకులలో మాలవ్య ఒకడు. బ్రిటీష్ నియంతల రాజ్యానికి ఊతమిచ్చేందుకు ప్రారంభించిన సైమన్ కమీషన్కు వ్యతిరేకంగా గళం విప్పాడు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించడానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర సమర యోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింపచేసాడు. ఆయన గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను అనుక్షణం అనుసరించడానికి ఇష్టపడేవాడు. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్టడానికి ప్రయత్నించాడు. 1932 ఆగష్టులో జరిగిన రెండవ రౌండు టేబులు సమావేశం తరువాత రామ్సే మెక్డొనాల్డ్ ప్రధాన మంత్రిగా ఉన్న బ్రిటిషు ప్రభుత్వం, బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదన మేరకు బ్రిటిషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును తీసుకొచ్చింది. ప్రభుత్వం అల్ప సంఖ్యాక మతస్తులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం ఈ అవార్డు లక్ష్యం. అయితే ముస్లిములు, సిక్కులతో పాటు, దళితులను కూడా అల్ప సంఖ్యాక మతస్తులుగా ఈ అవార్డు ప్రకటించింది. అయితే మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించాడు. దళితులను విడదీస్తే హిందూ మతం విచ్ఛిన్నం అవుతుందని భావించి, అందుకు నిరసనగా గాంధీ పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహారదీక్ష చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు గాంధీ వాదనకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో అంబేద్కరు ఎరవాడ జైల్లో గాంధీతో చర్చలు జరిపాడు. వారి చర్చల ఫలితంగా వెలువడిందే పూనా ఒప్పందం. 1932లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన పూనా పాక్ట్ అగ్రిమెంట్ పై ఆయనతో కలిసి మాలవ్య సంతకం చేశాడు. మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం, ప్రపంచంలోనే పెద్ద విశ్వ విద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు, విజ్ఞానశాస్త్రము, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలలో విద్యనభ్యసిస్తున్నారు. మాలవ్య ఆ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశాడు. జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 1946 నవంబరు 12 (వయసు 84)న బనారస్ మరణించాడు. డిసెంబర్ 24,2014 న మదన్ మోహన్ మాలవ్యను ఆయన మరణాంతరం భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక అవార్డు భారతరత్నకు వరించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## తెలుగు తనానికి నిర్వచనం తుమ్మల సీతారామ మూర్తి - డిసెంబర్ 25... అభినవ తిక్కన తుమ్మల జయంతి

అచ్చ తెలుగు మాటలతో అంద మైన పద్యాలు అల్లగలిగిన ఆధు నిక కవుల్లో ఆయనను మించిన వారు లేరంటె అతిశయోక్తి కాదు. కవిగా, పండితుడిగా, తనకు తానే తీర్చిదిద్దుకొన్న ప్రతిభాశాలి ఆయన. భాషాపరంగా ఆయన సంప్రదాయ బద్ధుడైనా భావనా పరంగా ఆధునికులు. అచ్చమైన గాంధేయవాది. తెలుగుదనం మూర్తీభవించిన, తెలుగు భాషాను రక్తి కలిగిన జాతీయోద్యమ కవి. ఆయనే అభినవ తిక్కన బిరు దాంకితుడు తుమ్మల సీతారామ మూర్తి. సౌమ్యశీలి, నిరాడం బరుడు, గాంధేయ వాది, తెలుగు రైతుబిడ్డ, ఆధునిక పద్య కవుల్లో అన్నింటా ముందుండి తెలుగు భాషానురక్తి కలిగిన మహా కవి. తుమ్మల సీతారామమూర్తి 1901 డిసెంబర్ 25 న గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు చెంచమాంబ, నార య్య. తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ప్రముఖుల వద్ద విద్యనభ్యసించారు. "మహాత్ముని ఆస్థానకవి" అని కట్టమంచి రామ లింగారెడ్డితో పలికించుకున్న తుమ్మల, ఆత్మకథ, మహాత్మ కథ వంటి ఆదర్శ ప్రౌఢ కావ్యాలు, ఆత్మార్పణము, రాష్ట్ర గానము, ఉదయ గానము, పఱిగ పంట, పైర పంట, శబల, సమదర్శి, నా కథలు వంటి సామాజిక కవిత్వాన్ని అందించారు. 1930లో ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయము నుండి ప్రథమ శ్రేణిలో ఉభయ భాషా ప్రవీణ పట్టాను అందుకున్నారు. చదువు పూర్తయ్యాక, తన స్వగ్రామం కావూరు లోని తిలక్ జాతీయ పాఠ శాలలో 1924 నుండి 1929 వరకు ఉపాధ్యాయుడిగా పని చేసారు. 1930 నుండి 1957 వరకు గుంటూరు జిల్లా బోర్డులోని దుగ్గి రాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యా యుడిగా పనిచేసారు. 1920 – 1930 మధ్య కాలంలో కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1922లో జైలుశిక్ష అనుభవించారు. 1928లో తుమ్మల 'ఆత్మార్పణము' అనే కావ్యాన్ని రచించారు. 1938 లో 'సోదరా లెమ్ము, నీ హక్కులందు కొమ్ము' అని ఆంధ్ర రాష్ట్ర సిద్ధి కోసం తన 'రాష్ట్ర గానం' ద్వారా తెలుగు వారిని వెన్ను తట్టి లేపారు. తెలుగు వారి పూర్వవైభవాన్ని ఎలుగెత్తి చాటి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రబోధించారు. 1840లో ధర్మజ్యోతి అనే ఒక గాథను,1943లో 'పఱిగి పంట', 1950లో గాంధీజీ ఆత్మ కథకు పద్య అనువాదమైన 'ఆత్మకథ'ను రచించారు. 1953లో 'ఉదయగానం' గావించారు. 1955లో 'శబిల' అనే ఖండ కావ్యాల సంపుటిని వెలువ రించారు. తెలుగు సాహిత్య సరస్వతికి శిరోభూషణమైన 'సంక్రాంతి తలపులు' ఈ సంపుటి లోనివే. 1957లో 'గీతాధర్మము' పేరుతో భగవద్గీతకు అనువాదం చేశారు. భర్తృహరి నీతి శతకాన్ని 'తెలుగు నీతి' పేరుతో తెనిగించారు. 'సర్వోదయ' సిద్ధాంతాన్ని విశదీ కరిస్తూ 1960లో 'సర్వోదయ గానం' చేశారు. 1963లో తన అభిరు చులు, ఆదర్శాలు, అనుభవాలు వెల్లడి చేస్తూ 'నేను' అనే కావ్యాన్ని,1964లో 'పైరపంట', 1967లో ఆదర్శ ప్రాయులైన కొందరు త్యాగ ధనుల గుణగణాలను విశదీకరిస్తూ 'సమదర్శి' రచించారు. తుమ్మల కవిత్వంలో గ్రామీణ జీవిత, ఆంధ్రత్వ, భారతీయత్వ, విశ్వమానవత్వ లక్షణాలుంటాయి. ఆయనది ప్రధానంగా ధర్మ ప్రబోధ నాత్మక కవిత్వం. తాను తెలుగు వాడననే అభిమానం ఆయనలో ఎక్కువ. తెలుగు జాతి, తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంటే పులకించి పోయే వారాయన.



కాల్పనిక వాదం, మానవీయత, దేశభక్తి అనే మూడు ప్రధాన అంశాలతో సీతారామ మూర్తి గారు తన రచనలను కొనసాగించారు. అనేక నాటకాలు, హరికథలు కూడా రచించారు. తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవలను కీర్తిస్తూ, ఘన సన్మానం చేసి 'అభినవ తిక్కన' అనే బిరుదును ఇస్తే, వినయ పూర్వకంగా, తాను తిక్కన అంత ఘనుణ్ణి కాదని, 'తెలుగు భాషకు సేవకుడను' అనే అర్థం వచ్చేలా 'తెనుగు లెంక' అని పేరు పెట్టుకున్న మహాకవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి. రైతు జీవితానికి కావ్య గౌరవం కల్పించి, తెలుగు నుడికారానికి ప్రాణంపోసి, తెనుగు దనానికి నిర్వచనంగా నిలిచిన తుమ్మలను కొంగర జగ్గయ్య 'కళా తపస్వి'గా సంభావించారు. ఒకనాడు వెండి తెర నాయకుడైన చిత్తూరు నాగయ్యకు తుమ్మల అభిమాన కవి. 1949 నిడుబ్రోలులో – గజారో హణము, గండ పెండేరము, కనకాభిషేకము, సువర్ణ కంకణముబీ 1960లో అఖిల భారత తెలుగు రచయితల మహాసభ సత్కారముబీ 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వ ప్రదా నముబీ 1969లో కేంద్ర సాహిత్య అకాడమీ బహు మానముబీ 1969లో ఆంధ్ర విశ్వ విద్యాల యము "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కారముబీ 1984 మద్రాసులో శ్రీ ఎల్. వి. రామయ్య చారిటీస్ జాతీయకవి అవార్డుబీ 1985 లో నాగార్జున విశ్వ విద్యాలయం నాగార్జున విశ్వ విద్యాలయము "డాక్టర్ ఆఫ్ లెటర్స్" (డి.లిట్) బిరుదుతో సత్కారము పొందారు. నాటి యువ కవులను ఉద్దే శించి...వచనము గేయము ఆధారముగా చేసుకొని యువ కవులు వ్యవహారిక భాషలో కవిత్వము వ్రాయుచున్నారు. వీరిలో శ్రీశ్రీ వంటి సిద్ధహస్తులు కొందరున్నారు. భాషా మార్గము ఏద్కెనను రచయిత లోతుగా సాహిత్య కృషి చేసినపుడే పది కాలాల పాటు అది చరిత్రలో నిలుచును. మా తరం వారు చదివినంత గట్టిగా నేటి యువతరం కావ్య పఠనం చేయడం లేదు. పత్రికల నిండా ఏదో రాస్తున్నారు.' అని తుమ్మల వ్యక్త పరిచిన అభిప్రాయం నేటికీ అక్షరాలా వాస్తవమని అనిపించక మానదు. 1990 మార్చి 21 న గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామాలో తుమ్మల సీతారామమూర్తి మరణించారు. ఇరవ్కై నాలుగు వేల పద్యాలు వ్రాసినా, ఆయన సాహిత్యం నిరాదరణకు గురవడం శోచనీయం. విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆయన రచనలు ఉండక పోవడం తెలుగు సాహిత్యాభిమానులకు బాధాకరం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అధ్వానంగా ఐటీడీఏ పనులు..

ఆసిఫాబాద్ : విద్యార్థులు చదువుకునే వసతిగృహాలు, గిరిజన ప్రాంతాల్లో నిర్మించే వివిధ ప్రభుత్వ భవనాల పనులు అధ్వానంగా సాగుతున్నాయి. నాణ్యతలేమి కారణంగా ఇవి స్వల్పకాలంలోనే కనుమరుగు అవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకమైన సామగ్రి ఉపయోగిస్తుండటంతోనే భవనాలు పగుళ్లు తేలుతున్నాయని ఆరోపిస్తున్నారు. పది కాలాల పాటు ఉండాలంటే మన్నికతో పూర్తి చేయాలని, పర్యవేక్షణను పకడ్బందీగా చేస్తేనే పటిష్ఠ నిర్మాణాలు సాధ్యమవుతాయని అంటున్నారు.

గిరిజన జిల్లాలో పలు పథకాల పరిధిలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు, రహదారులు, తాగునీటి వసతి కల్పన వంటి పనులు చేస్తున్నారు. రూ.లక్షల వ్యయంతో చేపడుతున్నా.. నాసిరకం ఇసుక, తగు పాళ్లలో వినియోగించని సిమెంటు కారణంగా వీటి నాణ్యత ప్రశ్నార్థకమవుతోంది. సకాలంలో పూర్తి చేయడంలోనూ సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. అనేక పనులు ప్రతిపాదనల దశలోనూ ఉండగా.. కొన్ని మాత్రం నిధులు విడుదలైనా, పనులు ప్రారంభించడంలో తాత్సారం కొనసాగుతోంది.

ఆసిఫాబాద్ పట్టణంలో గిరిజన ఉద్యానవన స్థలంలోని 20 ఎకరాలు



క్రీడా మైదానానికి కేటాయించారు. ఐటీడీఏ అధికారులు రూ.1.25 కోట్లు, అథ్లెటిక్ ట్రాక్ కోసం రూ.24 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు అక్కడే మట్టిని తవ్వి అక్కడే చదును చేశాడు. ఎనిమిది స్తంభాలు పెట్టినా విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. క్రీడాకారులకు మట్టితో చదును చేసిన ట్రాక్ మాత్రమే అందుబాటులో ఉంది. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహంలో వంట గది నిర్మాణ పనులు సైతం అధ్వానంగా సాగుతున్నాయి. రాళ్లతో కూడిన నల్లని ఇసుకను వాడుతున్నారు.

కెరమెరి మండలం రాంజీగూడ పునరావాస గ్రామంలో రూ.60 లక్షలతో గిరిజన బాలుర వసతిగృహం నిర్మిస్తున్నారు. పునాది స్థాయిలో భవనం పగుళ్లు కనిపిస్తున్నాయి. గోడ ఒక పక్కకు ఒరిగింది. ఇలాగే కొనసాగితే భవనం కొద్ది కాలంలోనే కూలిపోయే ప్రమాదం ఉంది. రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం నాలుగు సంవత్సరాల నుంచి వృథాగానే ఉంది. రాంజీగూడ పునరావాసం కోసం సీసీ రోడ్లు, మురుగు కాలువలు పూర్తి చేయడానికి రూ.1.75 కోట్లు ఖర్చు చేసినా.. ఈ గ్రామాన్ని తరలించే ప్రయత్నాలేవీ అధికారులు చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా 14 మల్టీపర్పస్ కేంద్ర భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్కో దానికి రూ.60 లక్షల చొప్పున మొత్తం రూ.8.40 కోట్లు కేటాయించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాల, మహిళల సమావేశ గది, ఇలా అన్ని విభాగాలను ఒకే చోట ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఒక్క భవనమే పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ భవనాల నిర్మాణాల్లో సైతం నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. రౌటసంకెపల్లి గ్రామంలో కడుతున్న భవనానికి క్యూరింగ్ చేయడం లేదని గ్రామస్థులు అంటున్నారు.

# చివరి దశలో పనులు.. పూర్తయితేనే నీళ్లు



సిరిసిల్ల : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉంది. వేములవాడ నియోజకవర్గంలోని శ్రీపాద ఎల్లంపల్లి, ప్యాకేజీ-9 ద్వారా మల్కపేట జలాశయాలకు నీరు నింపాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్ కోరారు. కాగా జిల్లాలోని ప్రాజెక్టుల పరిధిలో మేజర్, మైనర్ కాల్వల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటి పరిధిలో నేరుగా చెరువులను నింపడం ద్వారా భూగర్భజలాలను నిలకడగా ఉంటాయి. యాసంగిలో సాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. జిల్లాలో 1.31 లక్షల ఎకరాలకు నీరందించే ఎల్లంపల్లి స్టేజ్-2, ఫేజ్-1, కాళేశ్వరం 9, 10, 11, 12 ప్యాకేజీల పరిధిలో పనుల పరిస్థితిని పరిశీలిస్తే..

ప్యాకేజీ-11 పరిధిలో తంగళ్లపల్లి మండలంలో 32వేల ఎకరాల కొత్త ఆయకట్టు, 22 వేల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. రంగనాయకసాగర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వలు జిల్లా సరిహద్దులోకి కూడా రాలేదు. ప్రధాన కాల్వల నిర్మాణంతోపాటు మేజర్, మైనర్ కాల్వల నిర్మాణం పూర్తికావాలి. ఇందుకు ఖర్చుచేసిన నిధులు: రూ.2000 కోట్లు. ఇంకా అవసరమైన నిధులు రూ.152 కోట్లు, సేకరించాల్సిన భూమి 392.27 ఎకరాలు

ఎల్లంపల్లి స్టేజ్-2, ఫేజ్-1 పనులు 2018లో పూర్తికావాల్సి ఉంది. వేములవాడ నియోజకవర్గం పరిధిలో విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో అసంపూర్తి పనుల్లో కదలిక వచ్చింది. చందుర్తి, రుద్రంగి మండలాల్లోని మర్రిపల్లి, లచ్చపేట, నాగారం చెరువుల అభివృద్ధితోపాటు అసంపూర్తి కాల్వల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. గంగాధర నుంచి వేములవాడ వరకు రెండు కెనాల్ నెట్‌వర్క్ ప్యాకేజీలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే 49,500 ఎకరాలకు సాగునీరందుతుంది. ఇందుకోసం ఖర్చుచేసిన నిధులు రూ.1737 కోట్లు కాగా అవసరమైన నిధులు రూ.23.50 కోట్లు. సేకరించాల్సిన భూమి 650 ఎకరాలు

ప్యాకేజీ-10లో రూ.2400 కోట్లతో 90శాతం పనులు పూర్తయ్యాయి. ఆయకట్టుకు నీరందించే మైనర్, మేజర్ కాల్వల నిర్మాణాలు జరగలేదు. ప్రస్తుతం అన్నపూర్ణ జలాశయం ప్రధాన కాల్వతో ఇల్లంతకుంట మండలంలో చెరువులను నింపడం ద్వారా 15వేల ఎకరాలకు మాత్రమే నీరందుతుంది. కాల్వలకు భూసేకరణ జరగాలి. ఇవి పూర్తయితే కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పరిధిలో మరో 15వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇందుకోసం

ఖర్చుచేసిన నిధులు రూ.2400 కోట్లు కాగా అవసరమైనవి రూ.134 కోట్లు, సేకరించాల్సిన భూమి: 301.34 ఎకరాలు.

ప్యాకేజీ-12 పరిధిలో మల్లన్నసాగర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వ ద్వారా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో 22 వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రానుంది. దీనిలో ముస్తాబాద్ మండలంలోని గ్రామాల్లో ప్రధాన కాల్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గంభీరావుపేట మండలం లింగన్నపేట చెరువులోకి ఈ కాల్వ వెళుతుంది. దీని పరిధిలో 22వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రావాల్సి ఉంది. ప్రస్తుతం పనులన్నీ అసంపూర్తిదశలో ఉన్నాయి. ఇందుకోసం ఖర్చుచేసిన నిధులు రూ.3200 కోట్లు, అవసరమైన నిధులు: రూ.50 కోట్లు, సేకరించాల్సిన భూమి 86.7 ఎకరాలు

ప్యాకేజీ-9లో ప్రధానంగా సొరంగం, మల్కపేట జలాశయం, దానికి ఎగువన సింగసముద్రం వరకు ప్రధాన కాల్వ నిర్మాణాలతోపాటు ఎగువ మానేరు వరకు ఇప్పటికే 81 శాతం పనులు పూర్తయ్యాయి. మల్కపేట జలాశయంలో నీటిని నింపేందుకు అవకాశం ఉన్నా చిన్నపాటి పనులతో ఆటంకాలు ఏర్పడ్డాయి. దీనిలో ప్రధానంగా ఆయకట్టుకు నీరందించే మైనర్, మేజర్ కాల్వల నిర్మాణం ముందుకు సాగడంలేదు. భూసేకరణ, పరిహారం చెల్లింపుల్లో అడ్డంకిగా మారింది. కాల్వల నిర్మాణం జరిగితే సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో 56 వేలు, వేములవాడ నియోజకవర్గంలో కోనరావుపేట మండలంలో 30 వేల ఎకరాలకు నీరందుతుంది. ఇందుకోసం ఖర్చుచేసిన నిధులు రూ.1180 కోట్లు కాగా ఇంకా అవసరమైనవి రూ.340 కోట్లు, సేకరించాల్సి భూమి 752.37 ఎకరాలు.

# ఉద్యోగాల కల్పనకు నైపుణ్య శిక్షణ..!

ములుగు : నిరుద్యోగ యువతకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ములుగు జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్, నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ దివాకర ప్రత్యేక శ్రద్ధ చూపి ములుగులోని బీసీ బాలుర హాస్టల్ భవనంలో 30 మంది అభ్యర్థులు శిక్షణ పొందేందుకు వీలుగా రెండు గదులను సిద్ధం చేశారు.

**23 వరకు దరఖాస్తుల స్వీకరణ**

నైపుణ్య శిక్షణ కేంద్రంలో ప్రవేశం పొందాలనుకుంటే డిసెంబరు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. టెక్నికల్, నాన్ టెక్నికల్‌లో శిక్షణ పొందేందుకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ వంటి కోర్సులు చదివి, 18 నుంచి 35 ఏళ్ల లోపున్న వారు అర్హులు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలి. పూర్తి వివరాలకు 88862 20324, 94403 48961 నెంబర్లలో కూడా సంప్రదించొచ్చు.

**అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం.. - టీఎస్.దివాకర, కలెక్టర్, ములుగు**

ములుగు పట్టణంలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఈ



నెలలో ప్రారంభించనున్నాం. రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం. 25 కంప్యూటర్లు, రెండు ప్రొజెక్టర్లు సమకూర్చాం. దాంతో పాటు హై స్పీడు ఇంటర్‌నెట్, సీసీ కెమెరాలు, ఏసీలు కూడా ఏర్పాటు చేశాం. నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. టాస్క్ అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరుల సేవలను, ప్రభుత్వం, అకాడమీల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి లాభాపేక్ష లేకుండా ఏర్పాటు చేసిన సంస్థ.

**మూడు విభాగాలుగా..**

కేంద్రంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమాన్ని శిక్షణ-1, శిక్షణ-2, జాబ్ ప్లేస్‌మెంటు ఇలా మూడు భాగాలుగా విభజించారు. ఒక్కో విభాగంలో పది రోజులపాటు తర్ఫీదు ఇచ్చేలా నిర్ణయించారు.

శిక్షణ-1లో.. నైపుణ్యాల పరిచయం, కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, గణితం తదితర నైపుణ్యాలు.. సి.ప్రోగ్రామింగ్ మూల సూత్రాలు, డేటా బేస్ కాన్సెప్ట్, సమయ నిర్వహణ-ఉత్పాదకత, మాక్ ఇంటర్వ్యూలపై శిక్షణ ఉంటుంది.

శిక్షణ-2లో.. రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూకి తయారీ, కెరీర్ అభివృద్ధి, ఉద్యోగ అన్వేషణ వ్యూహాలు, వ్యక్తిగత బాండింగ్, ఆన్‌లైన్ ఉనికి, సాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్, గణిత నైపుణ్యాలపై తర్ఫీదు ఉంటుంది. జాబ్ ప్లేస్‌మెంట్‌లో.. వివిధ రకాల కంపెనీలకు ఉపయోగపడే కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. ప్రధానంగా డిజిటల్, సోలార్ టెక్నిషియన్, రిటైల్ సేల్స్, ఆటోమొబైల్, ఐటీ, ఫార్మా, కన్సల్టింగ్, బ్యాంకింగ్, టెలికాం రంగాలకు చెందిన కంపెనీల్లో నియామకమయ్యేలా తయారు చేస్తారు.

# కుష్ఠు పై సమరమే!

ఖమ్మం : ప్రమాదకరమైన కుష్ఠువ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. మైకో బ్యాక్టీరియం లెప్రీ అనే సూక్ష్మక్రిమి ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నా.. కొత్తగా కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా.. ఆరోగ్యాన్ని కబలిస్తోంది. కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 2 నుంచి 15 వరకు వైద్యారోగ్యశాఖ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) స్క్రీనింగ్ చేపట్టింది.

**లక్షణాలివే..** పేదరికం, అపరిశుభ్రత, అధిక జనసాంద్రత ప్రాంతాలు, రోగనిరోధకశక్తి తక్కువగా ఉండటం వ్యాధికి కారణాలు అని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై మచ్చలు కనిపించినా, కాళ్లు, చేతులు చచ్చుబడినా, వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక దశలోనే గుర్తించినట్లయితే చికిత్సతోనే నయం చేయవచ్చు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, నరాల వాపు, నొప్పి తెలియని పుండ్లు, ముఖంపై గుల్లలు, చేతులు, పాదాల తిమ్మిర్ల వంటి లక్షణాలు కనిపిస్తే కుష్ఠువ్యాధిగా అనుమానిస్తారు. ఇది సోకిన వారికి అంగవైకల్యం సంభవిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు. ప్రాథమి కంగా పరదీయ నాడీవ్యవస్థ, చర్మం, ఎముకలు, కీళ్లు, శ్లేష్మపొరలు, కళ్లు, కండరాలు, వృషణాలు, అడ్రినల్స్ వంటి శరీర కణజాలాలను ప్రభావితం చేస్తుంది. చికిత్సతో నిర్మూలించే ఈ వ్యాధి



బాధితులను దీర్ఘకాలికంగా వేధిస్తుంది. వయసుతో నిమిత్తం లేకుండా రెండేళ్ల పైబడిన లక్షణాలు ఉంటాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**ప్రత్యేక కార్యాచరణ**

కుష్ఠువ్యాధి నిర్మూలనకు క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణకు పూనుకుంది. ప్రజల్లో అవగాహన పెంపొందించటం తోపాటు కేసులను గుర్తించేందుకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సర్వే జరుపుతున్నారు. అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన బాధితులకు చికిత్స అందించి ఔషధాలు అందిస్తున్నారు. గతంలో కొంత లక్ష్యాన్ని నిర్దేశించుకుని లెప్రసీ సర్వే నిర్వహించేవారు. ఈ ఏడాది అందరికీ పరీక్షలు చేసి బాధితులను గుర్తించాలని ఆరోగ్యశాఖ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. ఖమ్మం జిల్లాలో గతేడాది 18ఏళ్ల లోపు పిల్లల్లోనూ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించింది. 96 కొత్త కేసులకు చికిత్సలు అందించటంతో బాధితులు పూర్తిగా కోలుకున్నారు. కుష్ఠు వ్యాధిని ముందుస్తుగా గుర్తించి చికిత్సలతో పూర్తిగా నయం చేయవచ్చు. ఆరోగ్యశాఖ బహుళ ఔషధ చికిత్స అందిస్తుంది. 5 మచ్చల్లోపు ఉంటే 6 నెలలు, ఆపైన ఉన్నట్లయితే 12 నెలల పాటు ఔషధాలు వాడాలి. క్రమం తప్పకుండా మాత్రలు తీసుకున్నవారు పూర్తిగా కోలుకుంటారు. ఒకసారి తగ్గితే మళ్లీ వ్యాధి సోకే అవకాశం తక్కువే. జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించి కేసులను గుర్తించే ప్రక్రియ చేపట్టాం. ఇది నిరంతర ప్రక్రియ. - డా.కళావతిబాయి, డీఎంహెచ్ఓ, ఖమ్మం

# ఎన్నాళ్లకెన్నేళ్లకు..



కొత్తగూడెం : లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొనుగోలు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. తెల్లకాగితాలపై ఒప్పందాల ద్వారా (సాదాబైనామా) 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన కొనుగోళ్లను క్రమబద్ధీకరించాలని ఆర్ఓఆర్-2024 చట్టం సెక్షన్ 6(1) కింద నిర్ణయించింది. ఆర్‌డీఓ స్థాయిలో విచారణ జరిపాక క్రమబద్ధీకరణ ప్రక్రియ నిర్వహించనుంది. ఏళ్ల క్రితం సాదాబైనామా రూపంలో భూములు కొని అనుభవిస్తున్నా.. సరైన పత్రాలు లేకపోవటంతో ప్రభుత్వం వారిని రైతులుగా గుర్తించటం లేదు. గత ప్రభుత్వం వీటిని క్రమబద్ధీకరించటం కోసం దరఖాస్తులు స్వీకరించినా.. వాటిని పరిష్కరించటంలో విఫలమైంది. కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా సాదాబైనామాలకు భూహక్కులు వర్తింపజేస్తామని ప్రభుత్వం తాజాగా ప్రకటించటంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**ఉభయ జిల్లాల్లో 1,73,960 దరఖాస్తులు**

గత ప్రభుత్వం సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. 2014 జూన్ 2లోగా లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొన్న రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి పాసుపుస్తకాలు జారీచేయాలని భావించింది. 2020 అక్టోబర్‌లో ప్రకటన వెలువరించి నవంబర్ 10 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఖమ్మం జిల్లాలో 1,11,449, భద్రాద్రి కొత్తగూడెంలో 62,511 మంది దరఖాస్తు చేసుకున్నారు. నాలుగేళ్లుగా వాటికి పరిష్కారం లభించలేదు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో సాదాబైనామా భూములు కలిగిన రైతులకు భూహక్కులు లభించే అవకాశం ఉంది. అయితే ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించటంతో పాటు వీటి పరిష్కారానికి 'భూ-భారతి'లో ప్రత్యేక ఐచ్ఛికం తీసుకొస్తే మార్గం సులువవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

**ధరణి రాకతో బేజారు..**

ఏళ్ల క్రితం లిఖితపూర్వక ఒప్పందం ద్వారా భూములు కొన్న రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవటంతో వారందరూ భూహక్కుదారులుగా గుర్తింపు పొందలేకపోయారు. 2020లో వచ్చిన 'ధరణి' వారి సమస్యలను రెట్టింపు చేసింది. అప్పట్లో భూదస్త్రాల్లోని పట్టాభూములు విక్రయించిన వారి పేర్లమీదనే కొత్త పాసుపుస్తకాలు వచ్చాయి. గతంలో వారి పూర్వీకులు విక్రయించిన భూముల పాసుపుస్తకాలు వారసులకు రావటంతో ఆ పొలాలు తమవేనని కబ్జాపెడుతున్నారు. సాదాబైనామా భూముల వివాదాలకు ధరణి కేంద్ర బిందువైంది.

**వీటికి పరిష్కారం లభించినట్లే..**

సాదాబైనామా పత్రాలు చట్టపరంగా ధ్రువీకరించినవి కాకపోవటంతో సదరు భూమి మీద హక్కులను రుజువు చేసుకోవటం రైతులకు కష్టంగా మారుతోంది.

సాదాబైనామా భూములపై పూర్వపు యజమానులు లేదా వారి వారసులు హక్కు కలిగి ఉన్నట్లు కేసులు వేస్తే వాటిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

భూ క్రయవిక్రయాలకు చట్టపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. పట్టా లేకపోవటం వల్ల రాయితీలు, బ్యాంకు రుణాలు అందటం లేదు. భూమి అసలు యజమాని ఎవరో తెలుసుకోవటం కష్టమవటంతో సదరు భూముల హక్కుల కోసం వివాదాలు ఏర్పడుతున్నాయి. సాదాబైనామాల క్రమబద్ధీకరణతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

# ఏళ్ల కల నెరవేరిన వేళ..

వరంగల్ : 'సమీపంలోని శివునపల్లితో పాటు చాగల్లు పంచాయతీలు సైతం కొత్త పురపాలికలో అంతర్భాగం కానున్నాయి. 'పురపాలికగా రూపాంతరం చెందితే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం నుంచీ నిధుల కేటాయింపు పెరగనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు పట్టణం అన్ని రంగాల్లో వృద్ధికి అవకాశం ఉంటుంది.'

**ప్రణాళికాబద్ధ విస్తరణ**

ఏయే ప్రాంతాలను కలుపుతూ పురపాలికగా ఏర్పాటు చేస్తున్నారో త్వరలో ప్రభుత్వం ముసాయిదా విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తుందని ఓ అధికారి తెలిపారు. అన్ని వివరాలు క్రోడీకరించిన తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. అనంతరం పట్టణంలో నిర్మాణాలతో పాటు ప్రతి అంశం ప్రణాళికాబద్ధంగా పురపాలిక నిబంధనలను అనుసరించి జరగనుంది. పురపాలికగా రూపాంతరం చెందితే పన్నుల భారం పెరుగుతుందనే భావన ప్రజల్లో నెలకొంది. ఉపాధి హామీ పనులు సైతం పట్టణాల్లో ప్రస్తుతం నిర్వహించడం లేదు. వీటికి ప్రత్యామ్నాయాలుగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో పేదలకు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు పురపాలికల ప్రత్యేక గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ నిధులు జనాభా ఆధారంగా అందనున్నాయి. ఘన్‌పూర్ ప్రజల ఏళ్ల కల త్వరలోనే నెరవేరబోతోంది. మేజర్ పంచాయతీని పురపాలికగా మారుస్తామని అసెంబ్లీ సాక్షిగా పురపాలిక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించడంతో గత రెండు ఎన్నికల్లో ప్రధానాంశంగా ఉన్న ఈ హామీ కార్యరూపం దాల్చనుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోనే మేజర్ పంచాయతీగా ఉన్న ఘన్‌పూర్‌కు ఇటీవల రెవెన్యూ డివిజన్ హోదా దక్కింది. ఏళ్ల నుంచి ప్రతిపాదనల దశలోనే ఉన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ గ్రామాన్ని పురపాలికగా చేయాలని



స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి గత కొన్నాళ్లుగా పట్టుబడటంతో తాజాగా కాంగ్రెస్ సర్కారు ఈమేరకు ప్రకటన చేసింది. విధి విధానాలు త్వరలోనే వెల్లడి కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

ఏళ్ల నుంచి ప్రతిపాదనల దశలోనే ఉన్న పురపాలిక అంశాన్ని సర్కారు గుర్తించి నేరవేర్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ ప్రాంత అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయం సహకరిస్తుంది. గతంలో నాయకులు హామీలు ఇచ్చారే కానీ నేరవేర్చలేదు. ఇప్పుడీ ప్రజాప్రభుత్వంలో ప్రజల హామీని నేరవేర్చాం. - కడియం శ్రీహరి, శాసనసభ్యులు, స్టేషన్ ఘన్‌పూర్

**మరింత అభివృద్ధికి మార్గం సుగుమమైంది**

పురపాలికగా ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నాం. ఇప్పుడు అది సాకారమవుతుంది. దీని వల్ల మా ప్రాంతం మరింత అభివృద్ధి జరుగుతుంది. - గంగారపు సుధాకర్, శివునిపల్లి

ఇప్పటికైనా సౌకర్యాలు కల్పించాలి జాతీయ రహదారిపైన ఉన్నా ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఆశించినంత అభివృద్ధి జరగలేదు. ఇప్పటికైనా మెరుగైన వసతులు కల్పించి అభివృద్ధిచేయాలి. మా కోరిక తీరినందుకు సంతోషంగా ఉంది. - తెల్లాకుల రామకృష్ణ, వ్యాపారవేత్త, ఘన్‌పూర్

# రాములోరి వెండి ఇటుక సొత్తు రికవరీ?

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో కనిపించకుండా పోయిన వెండి ఇటుకకు సంబంధించిన పైకాన్ని ఇటీవల రికవరీ చేసి సమాచారాన్ని దేవాదాయ శాఖకు పంపినట్లు ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. వెండి పర్యవేక్షణ బాధ్యతలను చూసే సిబ్బంది నుంచి దాదాపు రూ.8 లక్షలను రికవరీ చేసి దేవుడి ఖాతాకు జమ చేసినట్లు సమాచారం. వీరి హయాంలో ఇటుక కనిపించలేదన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాలను పరిశీలిస్తే.. భక్తులు మొక్కుల్లో భాగంగా వెండిని సమర్పిస్తుంటారు. ఇలా వచ్చిన రజతంలో కొంత మొత్తాన్ని పదేళ్ల కిందట ఏడు ఇటుకలుగా తయారుచేయించారు. ఒక్కో ఇటుక సుమారు 5 కిలోల బరువు ఉంటుంది. గత ఏడాది తూకం వేస్తుండగా ఇందులో ఓ ఇటుక జాడ కానరాలేదు. బ్యాంకు లాకర్లతో పాటు ఆలయంలోని వెండిని దాచే విభాగాన్ని పరిశీలించినా ఫలితం లేదు. వెండి ఇటుక కనిపించకుండా పోవడానికి సిబ్బంది అలసత్వమో.. అజాగ్రత్తనో.. ఇతర కారణమేదైనా ఆ మొత్తాన్ని వారు చెల్లించారు. ఇది బయట



వ్యక్తుల పని అయితే మాత్రం భద్రతలో లొసుగులపై దొంగలు కన్నేసే ప్రమాదం ఉంది. 2017లో సీతమ్మవారి మంగళ సూత్రం, లక్ష్మణస్వామి బంగారు లాకెట్ కొద్ది రోజుల పాటు కనిపించకుండా పోయాయి. ఆ తర్వాత ఇదే ఆలయంలోని బీరువాలో లభించాయి. బంగారం, వెండి నిల్వల తాజా వివరాలను ఇప్పటికీ వెల్లడించకపోవడం గమనార్హం.

ఉదయం





# విజయవాడ కోర్టుకు హాజరైన ఏపీ, తెలంగాణ నేతలు

విజయవాడ: ఉమ్మడి రాష్ట్రంలో ఓబులాపురం గనుల్లో 2007 జులై 21న అక్రమ మైనింగ్ పరిశీలనకు వెళ్లిన వారిపై నమోదైన కేసుకు సంబంధించిన విచారణను విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు వచ్చే ఏడాది జనవరి 8వ తేదీకి వాయిదా వేసింది. 21 మందిపై కేసు నమోదు చేయగా.. అందులో ముగ్గురు కేసు విచారణ దశలో ఉండగానే మృతి చెందారు. మిగిలిన అందరూ ఇవాళ విచారణకు హాజరుకావాల్సిందేనని గత విచారణ సమయంలో న్యాయాధికారి ఆదేశించారు. దీంతో అభియోగాలు నమోదైన ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు నాగం జనార్ధన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయకర్‌రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, పడాల అరుణ, అమర్‌నాథ్ రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, చిన్నం బాబురమేష్, కోళ్ల లలితకుమారి, బొమ్మడి నారాయణరావు, మసాల పద్మజ, పూల నాగరాజు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గురుమూర్తి, మెట్టు గోవిందరెడ్డి, యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ ఇవాళ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ముందు హాజరయ్యారు. 2007 జులై 21న అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలంలోని ఓబులాపురం ఇనుప గనుల పరిశీలనకు అప్పటి తెలుగుదేశం నేతలు ఓ బృందంగా వెళ్లినప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు పేర్కొన్న అంశాలపై అభియోగాలు ఎదుర్కొంటున్న నేతల నుంచి 313 స్టేట్‌మెంట్‌ను న్యాయాధికారి రికార్డు చేశారు. తమపై తప్పుడు కేసు బనాయించారని, ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచిన విధంగా తాము ఎక్కడా ఎలాంటి నేరానికి పాల్పడలేదని న్యాయాధికారి ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. న్యాయస్థానంపై విశ్వాసం ఉందని, కచ్చితంగా న్యాయం గెలుస్తుందని విచారణ అనంతరం అభియోగాలు ఎదుర్కొంటున్న నేతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీలో బలమైన నేతల్లో ఒకరైన నాగం జనార్ధన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు కోర్టు కేసులో భాగంగా రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ రావడం, పాత మిత్రులను కలుసుకున్న తరుణంలో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుని తాజా పరిణామాలపై చర్చించుకున్నారు.

# ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఎఫెక్ట్.. ఇడుపులపాయకు జగన్



కడప : ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. వైసీపీ కేవలం 11 సీట్లలో మాత్రమే.. తన సత్తా చాటింది. దీంతో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదు. అలాంటి వేళ.. పార్టీలోని పలువురు కీలక నేతలు పార్టీని వీడారు.. వీడుతోన్నారు. ఆ క్రమంలో కడప నగర పాలక సంస్థలోని పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లను కాపాడుకొని.. కడప కార్పొరేషన్‌ను నిలుపుకొనేందుకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. అందులోభాగంగా కడప నగర పాలక సంస్థలోని వైసీపీ కార్పొరేటర్లలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. మంగళవారం ఇడుపులపాయలోని తన స్వగృహంలో వారితో భేటీ అయ్యారు. ఏ ఒక్కరు పార్టీ వీడ వద్దని.. కార్పొరేటర్లతోపాటు వైసీపీ నేతలతో పార్టీ అధినేత మంతనాలు జరుపుతోన్నట్లు తెలుస్తొంది. మీ సమస్యలను ఏదో ఒక రూపంలో పరిష్కరిస్తానని.. తనను నమ్మలంటూ కార్పొరేటర్లతో వైఎస్ జగన్ పేర్కొన్నట్లు సమాచారం. వైసీపీ అధికారానికి దూరం కావడంతో.. కడపలోని ఆ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు ఇటీవల టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్న సంగతి తెలిసిందే. మరికొందరు కార్పొరేటర్లు సైతం అదే దారిలో నడిచేందుకు సిద్ధమైనట్లు ఓ చర్చ సైతం జిల్లాలో వాడి వేడిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగమేఘాల మీద రంగంలోకి దిగి..వారిని పార్టీ మారకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సోమవారం కడప నగర పాలక సంస్థ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే, టీడీపీ నేత ఆర్, మాధవీ రెడ్డికి కుర్చీ వేయక పోవడంతో ఆమె నిరసన వ్యక్తం చేశారు. గత సమావేశంలో సైతం ఆమె పట్ల ఇదే విధంగా వ్యవహరించిన విషయం విధితమే. అలాగే 54 ప్రజా సమస్యలను ఈ సమావేశంలో చర్చించేందుకు ఆమె ప్రయత్నించారు. కానీ వాటిని చర్చించేందుకు మేయర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఎమ్మెల్యే మాధవీ రెడ్డి విలేకర్ల సమావేశంలో కాస్తా ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా మేయర్ వ్యవహార శైలిని ఎండగట్టారు. అదీకాక... కడప నగర పాలక సంస్థ సమావేశంలో టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు పోటాపోటీగా నిరసనలు చేట్టారు. ఈ మొత్తం ఎపిసోడ్ అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాంటి వేళ.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రంగంలోకి దిగి.. తన పార్టీకి చెందిన కార్పొరేటర్లను బుజ్జగింప చేసుకొనే పనిలో పడ్డారని ఓ చర్చ సైతం సాగుతోంది.




తిరుమల: తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్‌బ్యాక్‌ను ఏపీ డిజిటల్ సహకారంతో స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో ఉన్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తున్నామని అన్నారు. అన్నప్రసాదంలో అదనంగా 258 మంది సిబ్బంది నియమిస్తున్నట్లు ప్రకటించారు.. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుమలలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులు సౌకర్యార్థం క్యూ కాంప్లెక్స్ వద్ద రూ. 3.6 కోట్లతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు.

తిరుమల..శారదా పీఠానికి కేటాయించిన మఠం లీజు రద్దు చేయడానికి నోటీసులు జారీ చేశామని అన్నారు. మఠం నిర్వాహకులు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.

# ధరలు పెరుగుతుంటే.. ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోంది: రాహుల్

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్ర పోతోందంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'కొన్ని రోజుల క్రితం స్థానిక కూరగాయల మార్కెట్‌కు వెళ్లాను. అక్కడ సామాన్యులను కలిసి మాట్లాడాను. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న విషయాలకు వారు రాజీ పడాల్సి వస్తుంది. గతంలో రూ.40 ఉండే కిలో వెల్లుల్లి ధర ప్రస్తుతం రూ.400 పలుకుతోంది. ఇలా ధరలు పెరిగిపోతుంటే.. ప్రజలు ఇంక పొదుపు ఏం చేయగలుగుతారు. ద్రవ్యోల్బణం పెరగడంతో సామాన్యుడి వంట గది బడ్జెట్ వారి చేయి దాటిపోతోంది. కేంద్రప్రభుత్వం ధరలను నియంత్రించకుండా.. కుంభకర్ణుడిలా నిద్రపోతోంది' అని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇటీవల గిరినగర్‌లోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ సామాన్యులతో ధరల పెరుగుదలపై చర్చించారు. అంతేకాకుండా దానివల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ధరలు పెరగడంతో ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సి వస్తుందని ఈసదర్భంగా కొందరు మహిళలు రాహుల్‌కు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు.



# రౌడీయిజాన్ని ప్రోత్సహించే సినిమాలకు అనుమతులు ఇవ్వొద్దు: కూనంనేని

హైదరాబాద్: సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నప్పటికీ క్రమంగా కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ "ఘటన జరిగిన వెంటనే పోలీసులు సీపీఆర్ చేయడంతో బాబు ప్రాణాలు దక్కాయని వైద్యులు చెప్పారు. సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య వివాదంగా ఈ అంశం మారింది. ఈ అంశాన్ని రాజకీయం చేయడం మానుకోవాలి. సినిమా రంగంలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. సినిమాల్లో విలన్లను హీరోలుగా చిత్రీకరించే పద్ధతిలో మార్పు రావాలి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారు.

బౌన్సర్లు గూండాల మాదిరిగా వ్యవహరించడం మూలంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఈ వ్యవస్థను రద్దు చేయాలని కమ్యూనిస్టు పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. సామాజిక సందేశాత్మక చిత్రాలకు సెన్సార్ బోర్డు అనుమతులు ఇవ్వకుండా.. పోలీసు వ్యవస్థను అణచివేసే విధంగా రౌడీయిజాన్ని ప్రోత్సహించే సినిమాలకు అనుమతులు ఇవ్వడం శోచనీయం" అని పేర్కొన్నారు.




# కేసీఆర్, హరీష్‌రావులకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, డిసెంబర్ 24: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుకు గురవడంపై దాఖలైన పిటిషన్‌పై భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులను న్యాయస్థానం సస్పెండ్ చేసింది. అలాగే ఫిర్యాదుదారుడికి కోర్టు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల (జనవరి) 7వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. కాగా.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై కేసీఆర్, హరీష్ రావులకు భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై రాజలింగం అనే వ్యక్తి భూపాలపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన భూపాల్లి కోర్టు.. కేసీఆర్‌తో పాటు అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీష్‌రావు, అలాగే బీఆర్ఎస్ హయాంలో పనిచేసిన నీటిపారుదల శాఖ అధికారులకు జూలై 10న నోటీసులు జారీ చేసింది.

సెప్టెంబర్ 5న కోర్టుకు హాజరుకావాలంటూ కేసీఆర్, హరీష్ రావులను భూపాలపల్లి కోర్టు ఆదేశించింది. అయితే భూపాలపల్లి కోర్టు ఇచ్చిన ఆదేశాలపై కేసీఆర్, హరీష్‌రావులు హైకోర్టును ఆశ్రయించారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలంటూ హైకోర్టు ధర్మాసనాన్ని కోరారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేసీఆర్, హరీష్‌రావు వేసిన పిటిషన్‌పై ఈరోజు (మంగళవారం) హైకోర్టు విచారణ జరిపింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన నోటీసులను సస్పెండ్ చేయడంతో పాటు ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేశారు. అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది.

# భారతమాత కన్న తెలంగాణ ముద్దుబిడ్డ.. శ్యామ్ బెనెగల్: కేసీఆర్



హైదరాబాద్: భారతీయ సినిమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మ భూషణ్ శ్యామ్ బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినీమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని, భరత మాత కన్న తెలంగాణ ముద్దు బిడ్డ శ్యామ్ బెనగల్ (బెనగల్ల శ్యామ్ సుందర్ రావు) అని కొనియాడారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింప చేసేవిధంగా దృశ్యమానం చేస్తూ, డాక్యుమెంటరీలు సినిమాల రూపంలో వారందించిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలన చిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనగల్ తెలంగాణకు గర్వకారణం అని అన్నారు. దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. తన 12వ ఏట తన తండ్రి బహుమతిగా ఇచ్చిన కెమెరాతో శ్యామ్ బెనెగల్ తన మొదటి చిత్రాన్ని తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించి తన సినీ ప్రయాణానికి బాటలు వేసుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలలో అంకుర్, మంథన్, మండి, నేతాజీ సుభాష్ చంద్ర బోస్: ది ఫర్‌గాటెన్ హీరో, జుబేదా, వల్ డన్ అబ్బా వంటివి అంతర్జాతీయంగా పేరు గడించాయి. ఆయన దర్శకత్వం వహించిన అనేక చిత్రాలు జాతీయ అవార్డులను గెలుచుకున్నాయి. తన 90వ జన్మదినానికి ముందు బెనెగల్ మాట్లాడుతూ తాను మూడు, నాలుగు ప్రాజెక్టులపై చర్చలు జరుపుతున్నానని చెప్పడం విశేషం.

# అల్లు అర్జున్ ఎపిసోడ్... రఘునందన్ రావు షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉడతా బెదిరింపులకు సినిమా ఇండస్ట్రీనే కాదు.. ఏ ఇండస్ట్రీ కూడా భయపడదని బీజేపీ ఎంపీ రఘు నందన్ రావు అన్నారు. నటుడు అల్లు అర్జున్ విషయంలో అత్యుత్సాహం తప్పితే ఏం లేదని చెప్పారు. అల్లు అర్జున్‌కు సంధ్య థియేటర్ దగ్గరకు అనుమతి లేనప్పుడు ప్రివెంటివ్ అరెస్ట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు ఆందోళనకు పిలుపునిచ్చినప్పుడు ముందస్తు హౌస్ అరెస్టులు చేస్తారని.. మరి అల్లు అర్జున్ అంశంలో పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేయకుండా వదిలేశారని రఘు నందన్ రావు నిలదీశారు. అల్లు అర్జున్ సమస్య ప్రస్తుతం కోర్టులో ఉందని.. దీనిపై ఎవరు ఎలాంటి కామెంట్ చేయలేరని అన్నారు. ఇవాళ(మంగళవారం) ఏబీఎన్‌తో రఘునందన్‌రావు మాట్లాడుతూ... హైదరాబాద్ సీపీ , పోలీస్ శాఖ అల్లు అర్జున్ హౌస్ అరెస్ట్ విషయంలో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉందని... బాధితులకు ఏం అనుకుంటే అది చేయొచ్చని అన్నారు. కానీ అసలు సమస్యను పక్కన పెట్టి రాజకీయం మొదలు పెట్టారని మండిపడ్డారు.

అసెంబ్లీలో చర్చించే అంశాలపై సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేకపోతే .. అసెంబ్లీలో చర్చించే అంశాల గురించి తాము చెబుతామని అన్నారు. సచివాలయానికి 100 అడుగుల దూరంలో ఉన్న అంబేద్కర్ జయంతి , వర్ధంతిలకు దండ వేసే తీరిక రేవంత్ రెడ్డికి లేదని మండిపడ్డారు. దేశంలో అతి పెద్ద విగ్రహం ఉందని. ఈ విగ్రహం ఎవరైనా పెట్టొచ్చు కానీ దాని విషయంలో రేవంత్‌రెడ్డి తీరు సరిగా లేదని చెప్పారు. అంబేద్కర్ విషయంలో రేవంత్ అనుసరిస్తున్న తీరును కాంగ్రెస్ నేతలు ఎందుకు నిలదీయరని అన్నారు. వివేక్ , వీహెచ్ లాంటి నేతలు ఎందుకు ఈ విషయంపై మౌనంగా ఉంటున్నారని ఎంపీ రఘు నందన్ రావు ప్రశ్నించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS, ALUGUNOOR(V),TiMMAPOOR(M), KARIMNAGAR DISTRICT, TELANGANA "PUBLISHED FORM,HNO.5-2-107,OSMANPURA, JAGITYALA DISTRICT, JAGITYALA, TELANGANA -RNI NO.APTEL/2011/39782 PH.NO :- 9848999998